ప్రజాశక్తి
శనివారం 21 అక్టోబర్ 2023 5 అనంతపురం

సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

రైతులకు పగటిపూట నాణ్యమైన విద్యుత్ అందించాలి

అగ్రి అడ్వైజరీబోర్డ్ చైర్మన్ టి.రాజశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో రైతులకు పగటి పూట నాణ్యమైన విద్యుత్‌ను 7 గంటల పాటు అందించాలని అగ్రి అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ టి.రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కేతన్ గార్గ్‌తో పాటు రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కరువు పరిస్థితి ఉందని, ఇలాంటి సమయంలో అధికారులంతా రైతుల పక్షాన నిలబడాలని అన్నారు. వర్షాభావంతో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు చేతికి రాలేదని అన్నారు. కంది పంట పూత దశలో ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు అన్ని విధాలా అండగా నిలబడాలన్నారు. వర్షాలు వస్తే రైతులకు అవసరమైన పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రైతులకు పగటిపూట నాణ్యమైన 9 గంటల పాటు విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు కనీసం 7 గంటలు నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని అన్నారు. పగటిపూట విద్యుత్ అందించడం అత్యంత కీలకమన్నారు. విద్యుత్ అధికారులు రైతుల గురించి ఆలోచించాలని, ఇందులో నిర్లక్ష్యం ఉండరాదని సూచించారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, అన్ని రకాల సామాగ్రి అన్నీ ఒకేసారి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లైవ్ స్టాక్ మిషన్ పథకం జిల్లాకు అత్యంత అవసరం అని,యూనిట్లు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే వారికి అవసరమైన సహకారం అందించి, అర్హత కలిగిన వారిని రుణాలు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ రబీ సీజన్ కోసం అవసరమైన విత్తనాలు అందించేందుకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. వర్షాలు వస్తే రైతులకు పంపిణీ చేసేలా పప్పుశనగ విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. మండల స్థాయిలో పత్తిపంట కొనుగోలు చేసేలా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాలన్నారు. క్షేత్రస్థాయిలో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు అనుగుణంగా విత్తనాలను పంపిణీ చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రోగ్రెసివ్ రైతులు సుబ్బారెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, రామ రంగారెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్ నేపథ్యంలో రైతులకు అవసరమైన విత్తనాన్ని ముందుగానే సిద్ధంగా ఉంచాలని కోరారు. రైతు బజార్‌లో అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. ఆయా శాఖల నుంచి రైతులకు ప్రోత్సాహకాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్ధక శాఖ జెడి సుబ్రమణ్యం, ఉద్యాన శాఖ డిడి రఘునాథరెడ్డి, ఎపిఎంఐపి పిడి ఫిరోజ్ ఖాన్, హెచ్‌ఎల్‌సి ఎస్‌ఇ రాజశేఖర్, జిల్లా సెరికల్చర్ అధికారి అంజనేయులు, మార్కెటింగ్ ఎడి చౌదరి, ఇరిగేషన్ ఎస్‌ఇ శ్రీనివాసులురెడ్డి, ఎపిఎస్‌ఎస్‌డిసి డిపిఎం లక్ష్మానాయక్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, సలహా మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని దా'రుణాలు'

రోజుకొకటి చొప్పున వెలుగులోకి ...

ట్రాక్టర్లు పోయాయి..అప్పులు మిగిలాయి

అధికారపార్టీ నేత నివాసానికి చేరిన వాహనాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మాయ మాటలతో పేదలపై విసిరిన అప్పుల వల దా'రుణాలు' రొజుకొకటి చొప్పున వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. అమాయకత్వాన్ని, పేదరికాన్ని ఆసరాగా చేసుకుని వారి పేరుపై ట్రాక్టరు రుణాలు తీసుకుని, అప్పు చెల్లించలేదని రికవరీ చేసి, అప్పులు మాత్రం వారి నెత్తిన పెట్టిన ఘటనలు కదిరి ప్రాంతంలో నిత్యం వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ట్రాక్టరుపోయి అప్పులు మిగిలాయంటూ బాధితులు లబోదిబో మంటూ పోలీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. వారి గోడు పట్టించుకునే వారు కరువయ్యారు.

ట్రాక్టరు తీసుకెళ్లారు...అప్పు మిగిలింది

ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ కింద ట్రాక్టరు ఇస్తున్నామని నమ్మబలకడంతో తనకల్లు మండలంలోని గుంజువారిపల్లి గ్రామానికి చెందిన దళిత గంగాధర కోటక్ మహీంద్ర ఫైనాన్స్ సంస్థ నుంచి రుణం తీసుకుని మహీంద్ర 475 ట్రాక్టరును తీసుకున్నాడు. సకాలంలో ఇఎంఐ చెల్లించలేదంటూ ట్రాక్టరు షోరూమ్‌కు సంబంధించిన ప్రతినిధి నరసింహులు అనే వ్యక్తి వెళ్లి ట్రాక్టరును వెనక్కు తీసుకొని వచ్చాడు. దీన్ని సంస్థకు అప్పజెబితే అప్పు ఉండదని చెప్పడంతో ఇవ్వడానికి గంగాధర అంగీకరించాడు. కాని దాన్ని సంస్థకు కాకుండా కడప జిల్లాకు చెందిన ఒక అధికారపార్టీ నాయకుడికి అమ్మి, తనకు రూ.30 వేలు చేతిలో పెట్టినట్టు గంగాధర తెలిపాడు. అయితే గత వారంలో కోటక్ మహీంద్ర సంస్థ ప్రతినిధులు ఇంటి వద్దకొచ్చి అప్పు కట్టాలని తనను ఒత్తిడి చేసినట్టు బాధితుడు వాపోయాడు. విషయాన్ని నరసింహులు దృష్టికి తీసుకెళితే నీకేమవదంటున్నాడని అన్నారు. దిక్కుతోచని పరిస్థితుల్లో గురువారం సత్యసాయి జిల్లా ఎస్పీకి తన మొరను వినపించేందుకు వెళ్లానన్నాడు. అక్కడ అధికారులు తన ఫిర్యాదును స్వీకరించి తనకల్లు పోలీసు స్టేషన్‌కు రెఫర్ చేశారని చెప్పాడు. తనను ఏదో రకంగా రుణ విముక్తుడిని చేయాలని గంగాధర వేడుకుంటున్నాడు. ఇలా ఇంకా అనేక ఫైనాన్స్ సంస్థలు, ట్రాక్టర్ షోరూమ్ యజమానులు కలసి పేద రైతులను అప్పుల ఊబిలోకి నెట్టివేసిన ఘటనలు వెలుగులోకి వస్తూనే ఉండటం గమనార్హం.

అటు తెలంగాణ...ఇటు అధికారపార్టీ నేతల వద్దకు చేరిన ట్రాక్టర్లు

మాయ మాటలతో రైతుల పేరిట అప్పులిచ్చి ట్రాక్టర్లను వారికి అంటగట్టారు. అనంతరం అప్పు కట్టలేదని వెనక్కు తీసుకుని సంస్థ ఖాతాల్లోకి జమ చేయకుండానే నేరుగా ఈ ట్రాక్టర్లను తెలంగాణ రాష్ట్రానికి తరలించి విక్రయించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు గత నెలలో పోలీసులు అక్కడికెళ్లి విచారణ చేపట్టిన సమయంలోనూ అనేక విషయాలు వెలుగులోకి వచ్చినట్టు సమాచారం. ఒక్కో ట్రాక్టరును నాలుగు లక్షల రూపాయలకు అక్కడ విక్రయించినట్లు తెలిసింది. మరికొన్ని ట్రాక్టర్లు కడప జిల్లాకు చెందిన ఒక అధికారపార్టీ నాయకుడి నివాసానికి చేరినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయన వద్ద వందల సంఖ్యలో ఫైనాన్స్ సంస్థకు సంబంధించిన ట్రాక్టర్లు ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఫిర్యాదులు అందుతున్నా పోలీసులు మీనమీషాలు లెక్కిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. ఈ రకంగా కదిరి ఒక్క ప్రాంతం నుంచే వందకు వరకు ట్రాక్టర్లను మాయం చేసినట్టు ఆరోపణలున్నాయి. స్థానికంగానున్న కొంత మంది దళారులు, ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు, ట్రాక్టర్ షోరూమ్ యజమానులు కలసి ఆడిన నాటకంలో పేదరైతులు బాధితులుగా మారారు.

22 నుంచి 'ప్రజా గర్జనభేరి'

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ వి.రాంభూపాల్

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ వి.రాంభూపాల్

ప్రజాశక్తి అనంతపురం కలెక్టరేట్

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఈనెల 22వ తేదీ నుంచి నవంబర్ 9వ తేదీ వరకూ సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా గర్జన భేరి కార్యక్రమం నిర్వహించనున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ తెలిపారు. శుక్రవారం గణేనాయక్ భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, పారిశ్రామిక, సేవారంగాల్లో జిల్లా తీవ్రంగా వెనుకబడిందన్నారు. ఇక అభివృద్ధి కొలమానాలన్నింటిలో అట్టడగున ఉందన్నారు. సాగు పది సంవత్సరాలుగా గణనీయంగా తగ్గిపోతోందన్నారు. 2, 31,151 లక్షల హెక్టార్లలో సాగు కావాల్సిన వేరుశనగ 1, 22,130 లక్షల హెక్టార్లే సాగవుతోందన్నారు. వరి పంట 17,440 హెక్టార్లకు 6,626 హెక్టార్‌లో సాగు జరుగుతోందన్నారు. ఇతర పంటల పరిస్థితి కూడా ఇలాగే ఉందన్నారు. పొలం బీడు పెట్టుకోలేక సద్ద, జొన్న, కంది, టమోటా లాంటి పంటలు సాగు చేస్తున్నారన్నారు. రాష్ట్రం విడిపోయి పది సంవత్సరాలు అవుతున్నప్పటికీ జిల్లాలో ఇప్పటి వరకు ఒక్క పరిశ్రమ స్థాపించలేదన్నారు. అక్షరాస్యత పెరిగిందని చెప్పే పాలకులు వారికి ఉపాధి కల్పించాల్సిన పరిశ్రమలు స్థాపించాలనే విషయాన్ని విస్మరిస్తున్నారని తెలిపారు. గతం నుంచి రాయదుర్గంలో జీన్స్, తాడిపత్రి బీడి, బండల పరిశ్రమలు, పామిడి గార్మెట్స్ పరిశ్రమలుపెద్ద సంఖ్యలో మూతపడుతున్న పాలకుల్లో చలనం లేదన్నారు. బెంగళూరు- హైదరాబాద్ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేసి లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని పాలకులు చెప్పే మాటలు నీటి మీద రాతలుగా మారాయని విమర్శించారు. సేవారంగంలో నిపుణులు ఉపాధి కోసం బెంగళూరు, హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్తుంటే పిల్లలు చదువుల కోసం విజయవాడ, గుంటూరులకు వెళుతున్నారని తెలిపారు. జిల్లా సమగ్రాభివృద్ధి జరగాలంటే ప్రత్యామ్నాయ విధానాలు రూపొందించి అమలు చేయాలన్నారు. ఇందుకోసం ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకూ సంతకాల సేకరణ, 29న జిల్లా సమగ్రాభివృద్ధి- ప్రత్యామ్నాయ విధానాలు అనే అంశంపై అనంతపురం నగరంలో సెమినార్ నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ 1, 2 తేదీల్లో తాడిపత్రి, గుత్తి, అనంతపురం, రాప్తాడు నియోజకవర్గాల్లో బస్సుయాత్ర, నవంబర్ 6 నుంచి 9వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా స్కూటర్ యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా ప్రజలు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.బాలరంగయ్య, వి.సావిత్రి, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.నాగేంద్ర, ఆర్‌వి.నాయుడు, రామాంజినేయులు, ఎం.నాగమణి, చంద్రశేఖర్‌రెడ్డి, క్రిష్ణమూర్తి, ముస్కిన్, వెంకటనారాయణ, అచ్యుత్, భాస్కర్, జగన్, నిర్మల, సూర్యచంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు

ప్రజాశక్తి నార్పల

నార్పల మండలంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో చిన్న పెద్ద అన్న తేడా లేకుండా చాలామంది వైరల్ ఫీవర్లతో బాధపడుతున్నారు. మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా ఇంటిలో ఎవరో ఒకరు జ్వరంతో బాధపడుతున్నారు. ప్రస్తుతం మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతోంది. ప్రయివేటు ఆస్పత్రుల్లో చూపించుకోవడానికి ఆర్థిక స్తోమత లేని వారు మండలంలో ఏ గ్రామంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుంటే ఆ గ్రామానికి వెళ్లి చూపించుకుంటున్నారు. నడవడానికి చేతకాని వారు గత్యంతరం లేని పరిస్థితిలో గ్రామాలకు వచ్చే ఆర్‌ఎంపిల వద్దనే వందలాది రూపాయలు ఖర్చు పెట్టి వైద్య సేవలు పొందుతున్నారు మండలంలో పెరిగిన వైరల్ ఫీవర్ నియంత్రణ కొరకు వైద్యాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నీటి ప్రభావమే కారణమంటున్న వైద్యులు : మండల వ్యాప్తంగా ఇటీవల కాలంలో వైరల్ ఫీవర్లు అధికమయ్యాయి. నీటి ప్రభావమే కారణమని నార్పల ప్రాథమిక వైద్యశాల వైద్యులు ప్రవీణ్ కుమార్, పప్పూరు ప్రాథమిక వైద్యశాల వైద్యులు రవిశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణ ప్రభావం. నీటిలో మార్పులు రావడంతోనే మండలంలో ఇటీవల కాలంలో వైరల్ జ్వరాలు అధికమయ్యాయని చెప్పారు. మండలంలో సమస్య తీవ్రంగా ఉన్న గ్రామాల్లో తాము తమ సిబ్బంది పర్యటించి వైద్యసేవలు అందిస్తున్నారని అన్నారు. ఈ వైరల్ ఫీవర్ ప్రభావంతో ఎప్పుడు వంద లోపు ఉండే ఓపి వారం రోజుల నుండి 150 నుండి 300 వరకు ఉంటుందని వైద్యులు చెప్పారు. అదేవిధంగా జ్వరం ఒకరి నుండి ఒకరికి సక్రమించకుండా వైద్యం కంటే వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వారు కోరుతున్నారు. వైరల్ ఫీవర్లు అదుపులోకి వచ్చేంతవరకు కరోనా సమయంలో పాటించిన నియమ నిబంధనలు పాటించడం మంచిదని వైద్యులు ప్రవీణ్ కుమార్, రవిశంకర్ అభిప్రాయపడ్డారు.

నార్పల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనం

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నీటితో నింపాలి : ఎమ్మెల్యే కేశవ్

ప్రజాశక్తి-ఉరవకొండ

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను వేగవంతంగా నింపకపోతే తాగునీటి కష్టాలు తప్పవని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నింబగల్లు గ్రామ సమీపంలో ఉన్న ఎస్ఎస్ ట్యాంకులు, ఫిల్టర్ బెడ్‌లకు నీటిని పంపింగ్ చేసే ప్రక్రియను సంబంధిత అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉరవకొండతోపాటు వివిధ గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లోకి హెచ్ఎల్సి జలాలను పంపింగ్ చేసుకోవడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందన్నారు. నవంబర్ 10వ తేదీకి హెచ్ఎంసికి నీటిని నిలిపివేస్తున్నట్లు ఇప్పటికే అధికారులు ప్రకటించిన నేపథ్యంలో ఎస్ఎస్ ట్యాంకుల్లోకి నీటిని పంపింగ్ చేసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఇప్పటి వరకూ పంపింగ్ చేసుకున్న నీరు కేవలం డిసెంబర్ వరకూ మాత్రమే సరిపోతుందని, వేసవిలో తాగునీటి సమస్యను ఏ విధంగా పరిష్కరిస్తారని నిలదీశారు. ప్రస్తుతం కాలువలో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ ఉరవకొండలో 12 రోజులకు ఒకసారి నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నారని, ఇక వేసవికాలంలో ఏవిధంగా నీటిని అందిస్తారని ప్రశ్నించారు. గత టిడిపి ప్రభుత్వంలో ఉరవకొండలో రోజు విడిచి రోజు తాగునీరు అందించే వారమని గుర్తు చేశారు. ప్రస్తుతం 15 రోజులుకు ఒక్కసారి కూడా అందించే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు నీటి పంపింగ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ అంజుమన్ సుప్రీన్‌తో సంబంధిత అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్న మంత్రి జయరామ్, ఎమ్మెల్యే పెద్దారెడ్డి

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన

హాజరైన మంత్రి జయరామ్, ఎంపీ రంగయ్య

ప్రజాశక్తి-తాడిపత్రి

పట్టణంలోని యల్లనూరు రోడ్డు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి కాంస్య విగ్రహాన్ని వాల్మీకి(బోయ) కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు అధ్యక్షతన శుక్రవారం ప్రతిష్టించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు జయరామ్ మాట్లాడుతూ వాల్మీకులు ప్రతి ఒక్కరూ తమ వంతుగా మీ పిల్లలను బాగా చదివించుకోవాలన్నారు. ఇందుకోసం జగన్ ప్రభుత్వం కూడా విశేష కృషి చేస్తోందన్నారు. ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో మెలగాలన్నారు. ముఖ్యంగా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం కళ్యాణ మండపం కోసం స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే పెద్దారెడ్డిని వాల్మీకులు అడగ్గా ఆయన స్పందిస్తూ స్థానిక అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ వాల్మీకులు నా కుటుంబ సభ్యులు అన్నారు. ఎందుకంటే ఎక్కువమంది వాల్మీకులు తమ కుటుంబం పట్ల విశ్వనియత చూపుతారన్నారు. వాల్మీకి మహర్షి కాంస్య విగ్రహ ఏర్పాటు జగనన్న ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బుక్కరాయసముద్రం : ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని విషజ్వరాలకు దూరంగా ఉండాలని వైద్యాధికారిణి డాక్టర్ స్వాతిలక్ష్మి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఇస్లాంపూర్ కాలనీలో మూడేళ్ల బాలుడు అక్రం డెంగీతో మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో శుక్రవారం ఇస్లాంపూర్ కాలనీలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యాధికారిణి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ప్రజలందరూ తప్పనిసరిగా డ్రైడే పాటించి నీటి నిల్వలను తొలగించుకోవడంతోపాటు పాత్రలను శుభ్రం చేసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం యాంటీ లార్వా ఆపరేషన్, ఇండోర్ స్పేస్ స్ప్రే చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ మద్దయ్య, సిహెచ్ఓ మోహన్‌రావు, సబ్ యూనిట్ సూపర్‌వైజర్లు నూర్‌బాషా, శ్రీధర్, పంచాయతీ సెక్రటరీ సాదిక్‌వలి, పిహెచ్‌ఎన్ చెన్నమ్మ, సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, జానీ రాజ్, సచివాలయ సెక్రటరీ సువర్ణ, ఏఎన్ఎం అంజనమ్మ, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బెలుగుప్ప మాంగోటి చెరువుకు నీరు వదలాలి

ప్రజాశక్తి-బెలుగుప్ప

నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, రైతులు

మండలంలోని స్థానిక మాంగోటి చెరువు పూర్తిగా నిండేంత వరకూ జీడిపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని వదలాలని వైసిపి నాయకులు, రైతులు డిమాండ్ చేశారు. చెరువుకు వస్తున్న నీటిని నిలిపివేయడంతో స్థానిక వైసిపి నాయకులు, రైతులు జీడిపల్లి రిజర్వాయర్ దగ్గరకు చేరుకుని 35 ప్యాకేజీ కింద గొల్లపల్లి రిజర్వాయర్ పంప్‌హౌస్ కాలువ ద్వారా తరలిస్తున్న నీటిని బంద్ చేయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెలుగుప్ప మాంగోటి చెరువు, శీర్పి చెరువులకు నీరు ఇస్తామని చెప్పిన అధికారులు పది రోజుల కిందట నీటిని వదిలారన్నారు. కానీ శీర్పి చెరువుకు మాత్రమే నీరు వదిలి మాంగోటి చెరువుకు ఒకరోజు మాత్రమే నీరు విడుదల చేయడం బాధాకరమన్నారు. వెంటనే మాంగోటి చెరువును పూర్తిగా నింపాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న అధికారులు నాయకులతో ఫోన్‌లో మాట్లాడుతూ హెచ్ఎన్ఎస్ఎస్ సంబంధించి డిఇ 80 శాతం మంగోట్టి చెరువు నిండిందని తెలపడంతో నీటిని బంద్ చేసినట్లు తెలిపారు. చెరువు పూర్తిస్థాయిలో నిండేందుకు సమయం పడుతుందని చెప్పవడంతో తిరిగి నీటిని విడుదల చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఎట్టకేలకూ సాయంత్రం నాలుగు గంటల నుంచి మాంగోటి చెరువుకి నీరు వదలడంతో రైతులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దన్న, మండల కన్వీనర్ మచ్చన్న, జెసిఎస్ కన్వీనర్ శ్రీనివాసులు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, సింగిల్‌విండో డైరెక్టర్ శివలింగప్ప, అశోక్, గోపాల్, తిమ్మారెడ్డి, పాతన్న, నాగిరెడ్డి, నారాయణస్వామి, పూల ప్రసాద్, రాము, బ్రహ్మయ్య, తిప్పే స్వామి, రైతులు, తదితరులు పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికే పోలీసు 'గ్రీవెన్స్'

ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

పోలీసులు, పోలీసు కుటుంబ సభ్యుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కెఎన్ అన్బురాజన్ తెలిపారు. శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ నిర్వహించి పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం ముఖాముఖిగా సిబ్బంది సమస్యలు విన్నారు. సాయంత్రం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా దర్బార్ నిర్వహించి కింది స్థాయి సిబ్బంది నుంచి అధికారుల వరకూ ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీకి విన్నవించారు. ఆయా సమస్యలకు చట్టపరిధిలో పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, ఎం.హనుమంతు (ఏఆర్), డీపీఓ ఏఓ శంకర్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్‌పాల్, శ్రీనివాసులునాయుడు, శివప్రసాద్, ఎస్పీ సీసీ ఆంజనేయప్రసాద్, ఆయా పోలీసు స్టేషన్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

10 నుంచి 'చెకుముకి' సంబరాలు : డిఇఓ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నవంబర్ 10వ తేదీ నుంచి నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం జెవివి ఆధ్వర్యంలో రూపొందించిన చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్లను డిఇఓ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెకుముకి టాలెంట్ టెస్ట్ విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల పఠనాశక్తి, శాస్త్రీయ దృక్పథం పెంపుదలకు జెవివి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు భాస్కర్, కోశాధికారి జిలాన్ మాట్లాడుతూ 33 సంవత్సరాల నుంచి జెవివి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది నవంబర్ 10వ తేదిన 8, 9, 10, తరగతి చదువుతున్న విద్యార్థులకు పాఠశాల స్థాయిలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల, పట్టణ స్థాయిలో నవంబర్ 30వ తేదిన, డిసెంబర్ 17న జిల్లా స్థాయిలో చెకుముకి పోటీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లింగమయ్య, జెవివి నగర నాయకులు రామిరెడ్డి, వీరరాజు, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, ప్రసాద్, రసూల్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 30 వరకూ హెచ్‌ఎల్‌సికి నీరివ్వాలి

ఇరిగేషన్ అధికారులకు మాజీ ఎమ్మెల్యే వినతి

ప్రజాశక్తి-ఉరవకొండ

నియోజకవర్గంలో సాగవుతున్న పంటలను దృష్టిలో ఉంచుకుని హెచ్‌ఎల్‌సి, జిబిసి కాలువలకు డిసెంబర్ 30వ తేదీ వరకూ నీరు విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కోరారు. శుక్రవారం అనంతపురం హెచ్‌ఎల్‌సి కార్యాలయంలో ఎస్‌ఇ రాజశేఖర్, ఇఇ మోహనమూర్తి, డిఇ రఘు, తదితర అధికారులతో విశ్వ సమావేశమయ్యారు. ఇందులో భాగంగా నీటి విడుదల, లభ్యత, పంటలను కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ నెలాఖరు వరకూ నీటి విడుదలకు చర్యలు చేపట్టాలని కోరారు. వీలుకాకపోతే కనీసం ఆఫ్ అండ్ పద్ధతిలోనైనా నీటిని ఇచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. లేకపోతే వేలాది ఎకరాల్లో సాగైన పంటలు ఎండిపోతాయన్నారు. నీరు విడుదల కానీ పక్షంలో పంటలను కాపాడేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా హంద్రీనీవా నుంచి హెచ్‌ఎల్‌సికి నీటిని మళ్లించే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లో పంటలు ఎండకుండా కాపాడాలన్నారు. ఇందుకు స్పందించిన అధికారులు పండుగ తర్వాత క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను అంచనా వేస్తామన్నారు. తర్వాత ప్రత్యామ్నాయ అవకాశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.



హెచ్చెల్సీ అధికారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

సామాజిక న్యాయంతో సమాజంలోకి..

ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-శింగనమల

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సామాజిక న్యాయంతోనే జనంలోకి వెళ్లనున్నట్లు ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఈనెల 26న ప్రారంభం కానున్న బస్సుయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడా లేని రీతిలో వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక న్యాయాన్ని ప్రజలకు చాటిచెప్పేలా బస్సుయాత్ర ప్రారంభం అవుతుందన్నారు. దేశ చరిత్రలో బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీల వర్గాలకు పెద్దపీట వేసిన సీఎం జగన్ సామాజిక విప్లవం సృష్టించారన్నారు. అన్నివర్గాలకు వైసిపి ప్రభుత్వం చేసిన మేలును వివరించేందుకు, చేయాలనుకున్న మేలుని తెలియజేసేందుకు సామాజిక న్యాయభేరి బస్సు యాత్రను చేపడుతున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబ శివారెడ్డి

యువత సమాజ సేవలో పాల్గొనాలి

'మేరా దేశ్.. మేరా మట్టి'లో వక్తలు

ప్రజాశక్తి-తాడిపత్రి

యువత చదువుతోపాటు సమాజ సేవలో కూడా పాల్గొనాలని మున్సిపల్ కమిషనర్ జి.రవి పిలుపునిచ్చారు. అనంతపురం నెహ్రూ యువకేంద్రం, తాడిపత్రి మున్సిపల్, రెవెన్యూ కార్యాలయాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో 'నా మట్టి నా దేశం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమం ద్వారా యువతను జాతీయ సమైక్యతా, జాతీయ అభివృద్ధిలో పాల్గొనే విధంగా చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా యువతకు దేశ భక్తిని పెంపొందించుకోవాలన్నారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన విజేతలకు ప్రశంసాపత్రాలు, పతకాలు అందేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రంగారావు, డిప్యూటీ ఇఇ వెంకటసబ్బయ, ఐక్యరాజ్యసమితి అవార్డు గ్రహీత బిసాటి భరత్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి జీవన్‌కుమార్, నెహ్రూ యువ కేంద్రం డిడిఒ శ్రీనివాసులు, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కె.జయమారుతి, కార్యదర్శి వై.పవన్, సభ్యులు తుకారామ్‌నాయక్, శ్రీకాంత్, సంతోష్‌నాయక్, భరత్‌సాయి, గణేష్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి కలశాలను ఊరేగిస్తున్న దృశ్యం

నేరాలు ఘోరాలు

కర్ణాటక మద్యం స్వాధీనం

స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యంతో సెబ్ పోలీసులు

అనంతపురం క్రైం : కారులో అక్రమంగా తరలిస్తున్న 15 బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఇన్స్పెక్టర్ రవిచంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు సెబ్ అదనపు ఎస్పీ జి.రామకృష్ణ ఆదేశాల మేరకు విశ్వసనీయ సమాచారం ఆధారంగా రూరల్ పరిధిలోని ఆలమూరు క్రాస్ వద్ద వస్తున్న కారును తనిఖీ చేశారు. అందులో డిక్కీలో ఉన్న 15 బాక్సుల్లో 1,440 మద్యం టెట్రా పాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ధర్మవరం మండలం ఎల్కుంట్ల గ్రామానికి చెందిన బి.ప్రశాంత్ కుమార్ కర్ణాటకలోని వివిధ మద్యం షాపుల్లో టెట్రా పాకెట్లను కొనుగోలు చేసి సనప గ్రామానికి చెందిన కురుబ హనుమన్న అనే వ్యక్తికి సరఫరా చేయడానికి వెళ్తూ పట్టుబడ్డాడు. రామకృష్ణను అరెస్టు చేసి కారును సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే సనపకు చెందిన కురుబ హనుమన్న పై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఇన్స్పెక్టర్ తో పాటు సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

కారు బోల్తా..ముగ్గురికి గాయాలు

బొమ్మనహాల్ : మండలం కేంద్రం సమీపంలో కనేకల్ నుంచి బళ్లారికి వెళ్తున్న ఓ కారు అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో బోల్తా పడింది. దీంతో కారులు ప్రయాణిస్తున్న ముగ్గురు తీవ్రగాయాలపాయ్యారు. వెంటనే గమణించిన స్థానికులు చికిత్స నిమిత్తం బళ్లారికి తరలించారు. గాయాలపాలైన వారు కర్ణాటక వాసులుగా స్థానికులు చెబుతున్నారు.

రాయదుర్గం రైల్వేస్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి-రాయదుర్గం

నైరుతి రైల్వే హుబ్బల్లి డివిజినల్ రైల్వే మేనేజర్ హర్ష ఖరే శుక్రవారం రాయదుర్గం రైల్వేస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హుబ్లీ నుంచి ప్రత్యేక రైలులో వచ్చిన ఆయన నేరుగా కదిరిదేవరపల్లికు వెళ్లిరైల్వే స్టేషన్, తిరుపతి రైలు సేవల నిర్వహణను పరిశీలించారు. అనంతరం తిరుగు ప్రయాణంలో కళ్యాణదుర్గం, ఆవులదట్ల రైల్వేస్టేషన్లోను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రాయదుర్గం రైల్వే జంక్షన్‌లో కొత్తగా నిర్మించిన స్టేషన్ భవనాలు, పాత స్టేషన్‌లో ఉన్న సిగ్నలింగ్ వ్యవస్థ, రైలు సర్వీసుల నిర్వహణను తనిఖీ చేశారు. అనంతరం స్థానికులు అందజేసిన వినతిపత్రాలను స్వీకరించారు. ముఖ్యంగా రాయదుర్గం రైల్వేస్టేషన్‌లో టాటానగర్, జైపూర్, వారణాసి ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని, మంగళూరు నుంచి రాయదుర్గం మీదుగా ఆంధ్రప్రదేశ్ పరిపాలన రాజధాని విశాఖపట్నంకు కొత్త రైలు సర్వీసును ప్రారంభించాలని, రాయదుర్గం-బళ్లారి నడుమ డెమో షటిల్ రైలును నడపాలని స్థానికులు వినతిపత్రాలు అందజేశారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఆయన వెంట నైరుతి రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజినీర్ పీకే.వర్మ, సీనియర్ డివిజినల్ సిగ్నల్ టెలికం ఇంజినీర్ ఇతర అధికారులు ఉన్నారు.

రాయదుర్గం రైల్వేస్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న నైరుతి రైల్వే హుబ్లీ డివిజినల్ రైల్వే మేనేజర్ హర్ష ఖరే

కార్యకర్తలకు అండగా ఉంటాం

నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల

టిడిపి కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ భరోసా ఇచ్చారు. బోయ రామాంజనేయులు భార్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. అలాగే మైనార్టీ సీనియర్ నాయకులు సైదు మనమడు హాజీ కూడా అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బండారు శ్రావణిశ్రీ వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. అనంతరం సీనియర్ నాయకులు అశ్వర్థనారాయణ, పుల్లయ్య, నాగరాజు కుటుంబాలను పరామర్శించారు. అనంతరం బాబుతో నేను కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు అక్రమ అరెస్టును వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సి.వెంకటేశు, చిదంబరి దొర, జిసి.బాబు, చిదానందనాయుడు, గుర్ర లక్ష్మీనారాయణ, దాది కృష్ణారెడ్డి, ముంతా వెంకటేష్, వీరనారప్ప, రహంతుల్లా, అనుదేనాయక్, సుదర్శన్‌నాయక్, వీరాంజనేయులు, శంకర్, రాజశేఖర్‌యాదవ్, వెంకటనారాయణ, కాయల ఆదినారాయణ, గురప్ప, బోయ సత్తి, కురాక రాముడు, బెస్త శంకర్, పాపన్న, ఓబులేసు, బాలయాదవ్, రాయల్‌గోపాల్, శ్రీనివాసులు, నారాయణస్వామి, ఓబులేసు పాల్గొన్నారు.

కార్యకర్తలతో టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

పండ్ల తోటల రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుగా వెంకటచౌదరి

పుట్లూరు : పండ్ల తోటల రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుగా మండలంలోని ఓబులాపురానికి చెందిన వెంకటచౌదరి నియమితులయ్యారు. గురువారం తాడిపత్రిలో నిర్వహించిన పండ్ల తోటల రైతుసంఘం రాష్ట్ర సదస్సులో వెంకటచౌదరినికి నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పండ్ల తోటల రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సూరి, మండల కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, పెద్దయ్య తదితరులు అభినందనలు తెలిపారు.

గ్రామకంఠం భూమిని కాపాడాలి

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని 74 ఉడేగోళం సర్వే నంబర్ 77లో ఉన్న ఐదున్నర సెంట్ల గ్రామకంఠం భూమిని కబ్జా చేయకుండా రెవెన్యూ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు శివానంద, విజయ్‌కుమార్, తమన్న, శ్రీకంఠప్ప, ఓబయ్య కోరారు. ఈమేరకు స్థానిక కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ సురేష్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం ప్రధాన రహదారి, బైపాస్‌ను కలిపే కూడలి రోడ్డులోని వైఎస్ఆర్ విగ్రహానికి పడమర దిశలో ఉన్న భూమిలో పంచాయతీ బోరు కూడా ఉందన్నారు. కావున గ్రామ భవిష్యత్ అవసరాల దృష్ట్యా రెవెన్యూ అధికారులు ఈ స్థలానికి పట్టా మంజూరు చేయరాదని కోరారు. ఎవరికైనా కేటాయిస్తే కక్షలకు దారి తీసే అవకాశం ఉందని సూచించారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

ఉరవకొండ : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైస్ ఎంపిపి నర్సింహులు, ఎంపిడిఒ అమృతరాజు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని, రక్త పరీక్షలు బయట చేయించుకోవాలని చెబుతున్నారని రోగుల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. ఇందులో భాగంగానే ఆసుపత్రిని తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ఎక్కువగా వ్యాపిస్తున్నాయన్నారు. రక్త పరీక్షల సిబ్బంది, వైద్యులు కూడా రోగులకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు తిప్పయ్య, ఎంపిటిసి అంజి, హనుమంతు, వైసిపి నాయకులు వెంకటేశులు, ఆంజనేయులు, నాగప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయాల్సిందే.. : ఎంఆర్‌పిఎస్

అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

బుక్కరాయసముద్రం : మాదిగల ఎస్సీ వర్గీకరణ చేయాల్సిందేనని ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు డిమాండ్ చేశారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చేపట్టిన పాదయాత్రకు సంఘీభావంగా చేపట్టిన రాయలసీమ జిల్లాల పాదయాత్ర శుక్రవారం బుక్కరాయసముద్రానికి చేరుకుంది. ముందుగా అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు హరిగోపాల్, ఎంఎస్‌పి జిల్లా కన్వీనర్ బి.కదిరప్ప, సూరి, జెసి శేఖర్, రెడ్డప్ప, నిషార్ అహమ్మద్, స్వాతంత్రకుమారి, గుడిసి రామాంజినేయులు, బాణాసి సీనా, చంద్ర, శ్రీరాములు, రేకులకుంట రామాంజి, పెన్నప్ప, మల్లేసు, నార్పల పుల్లప్ప, రాజు, విహెచ్‌పిహెచ్ సత్యసాయి జిల్లా అధ్యక్షులు సొరప్ప, జానకిరామ్, మహిళా నాయకులు జయమ్మ, హసీనాబీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు బండ్లపల్లిలో 'ఆరోగ్య సురక్ష'

నార్పల : మండల పరిధిలోని బండ్లపల్లి సచివాలయ పరిధిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ దివాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పివికెకె ఐటీ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక రుద్రంపేటలో ఉన్న పివికెకె ఎంబిఎ కళాశాల విద్యార్థి ఎస్.నరసింహ అత్యంత ప్రతిభ కనబరిచి సౌత్ జోన్ లాన్ టెన్నిస్ క్రీడలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు తెలిపారు. ఈమేరకు శుక్రవారం స్థానిక కళాశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18న జెఎన్‌టియు అనంతపురంలో జరిగిన లాన్ టెన్నిస్ పోటీల్లో నరసింహ తన అసమాన ప్రతిభ కనబరచి జెఎంటియు బృందానికి ఎంపికవ్వటమే కాకుండా మొదటి బహుమతి సాధించినట్లు వివరించారు. నరసింహ ముున్ముందు మరిన్ని గొప్ప గొప్ప లక్ష్యాలను సాధించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ పల్లె కిషోర్, కోశాధికారిణి సింధూర, ప్రత్యేకాధికారి శ్రీనివాసులురెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, డీన్ సంతోష్‌కుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్రప్రసాద్, ఎఒ మనోహర్‌రెడ్డి, పీడీ ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

ఐటీ విద్యార్థి అభినందిస్తున్న పివికెకె యాజమాన్యం

'బాలయ్య'కు అభినందనలు

నందమూరి బాలయ్యకు బొకే అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ జగన్

అనంతపురం : భగవంత కేసరి సినిమా విజయవంతం కావడం పట్ల ఆయన అభిమాని, ఎన్‌బికె అభిమాన సంఘం వ్యవస్థాపకుడు జగన్, సినీనటుడు బాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ తండ్రీకూతుళ్ల అనుబంధంతో బాలయ్య తీసిన సినిమాకు అపూర్వ స్పందన వస్తోందన్నారు. ముఖ్యంగా బాలయ్య, శ్రీలీల సన్నివేశాలకు కన్నీరు పెట్టని ప్రేక్షకులు లేరన్నారు. మహిళలు మెచ్చిన గొప్ప చిత్రంగా, బాలయ్య కెరీర్‌లో ఓ మైలురాయిగా భగవంతు కేసరి నిలుస్తుందన్నారు.

రైతులకు అన్నదానం చేయడం అభినందనీయం

ప్రజాశక్తి-ఉరవకొండ

జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు రైతు దేవుళ్లకు అన్న ప్రసాదం అనే కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని ఉరవకొండ సిఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ వెంకట్‌స్వామి అన్నారు. రైతు దేవుళ్లకు అన్న ప్రసాదం కార్యక్రమం 2వ రోజు శుక్రవారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా పొలాల్లోకి వెళ్లి పనిచేస్తున్న రైతులకు ఆహార పొట్లాలను అందించారు. ఈ కార్యక్రమంలో జై కిసాన్ ఫౌండేషన్ సంస్థ నాగమల్లి ఓబులేసు, ఫౌండేషన్ ప్రతినిధులు రజినీకుమారి, గోపాల్, వంశీకృష్ణ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు అన్నదానం చేస్తున్న సిఐ, ఎస్, జైకిసాన్ ఫౌండేషన్‌సభ్యులు

ఆక్రమణ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని తురకపల్లి రోడ్డులో కబ్జాకు గురైన రూ.లక్షలు విలువజేసే ప్రభుత్వ స్థలాన్ని తక్షణమే అధికారులు స్వాధీనం చేసుకోవాలని ఎపి ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు అంజనప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని తుర్కపల్లి రహదారిలో సర్వేనెంబర్ 465 లోని డిటిపిసి అప్రూవల్ లేఅవుట్ లో రూ.60 లక్షలు విలువ చేసే 5 సెంట్ల స్థలాన్ని డేవిడ్ నాయక్ ఆక్రమించి దర్జాగా ఇల్లు కట్టుకుని పబ్బం గడుపుతున్నాడన్నారు. అనుమతులు లేకుండా ఇల్లు నిర్మించుకున్న కబ్జాదారునిపై చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో స్పందించిన మున్సిపల్ కమిషనర్ వెంటనే రెవెన్యూ అధికారులతో కలిసి విచారణ చేపట్టాలని టిపిఎస్ మహబూబ్ జాన్ కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు కరిడికొండ రాము,శివ, అబ్బేదొడ్డి, లాలెప్ప తదితరులు పాల్గొన్నారు.

యోగి వేమన విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

గుత్తి : కవి యోగి వేమన విగ్రహం ఏర్పాటుకు మండల కేంద్రంలో స్థలం కేటాయించాలని వేమన సంక్షేమ సంఘం నాయకులు కోరారు. స్థానిక పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో శుక్రవారం వేమన సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యోగివేమన ఎన్నో పద్యాలను రచించి సామాజిక స్పృహ కలిగించారని చెప్పారు. వేమన రచనలతో ప్రపంచవ్యాప్తంగా ఎంతో మందిని ఉన్నతమైన భావాజాలంతో సమాజాన్ని ముందుకు నడిపిందన్నారు. వేమారెడ్డి ఆశయాలను భవిష్యత్తు తరాలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వేమన సంక్షేమ సంఘం నాయకులు డాక్టర్ సి.వెంకటేశ్వర్లరెడ్డి, జయ రంగారెడ్డి, పి.వెంకటరామిరెడ్డి, వై.రాజశేఖర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, రఘురామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలివ్వాలి

నార్పల : కౌలు రైతులందరికీ రుణాలు మంజూరు చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంకు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ బ్యాంకులు మాత్రం ఇవ్వడం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారు హక్కుల చట్టం (2019) ప్రకారం కౌలు రైతులందరికీ పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం సి.సి ఆర్‌సిలు (గుర్తింపు కార్డులు) ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గంగాధర్, మండల సహాయ కార్యదర్శులు రామాంజినేయులు, రమేష్, సీనీయర్ నాయకులు సుధాకర్, రైతు సంఘం మండల అధ్యక్షులు జోసెఫ్, లలితమ్మ, సంజీవరాయిడు, కుళ్లాయప్ప, బాషా, నాగప్ప, కౌలురైతులు, తదితరులు పాల్గొన్నారు.

కవి 'జూపల్లి' మృతి తీరని లోటు

అనంతపురం : కవి, రచయిత జూపల్లి ప్రేమ్‌చంద్ మరణం సాహిత్య లోకానికి తీరని లోటు అని తెలుగు వెలుగు సాహిత్య, సామాజిక సేవా సంస్థ అధ్యక్షులు టి.వి.రెడ్డి అన్నారు. ప్రేమ్‌చంద్ మృతిపట్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమ్‌చంద్ ఎస్‌కెయులో పీజీ చేస్తూనే కవిత్వం, కథలు రాయడంతోపాటు విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొనేవారన్నారు. ఇందులో భాగంగా కార్మిక సంఘాలతో మంచి స్నేహ సంబంధాలు కొనసాగించేవారన్నారు. ఈవిధంగా 1980 నుండి కార్మిక ద్యమాలకు సన్నిహితులు కావడం విశేషమన్నారు. ఎదుటివారిని ప్రోత్సహించే గుణంతో పాటు మంచి స్నేహశీలిగా కొనసాగేవారని గుర్తు చేశారు. నివాళులర్పించిన వారిలో సంస్థ ఉపాధ్యక్షులు కె.అల్తాఫ్‌తోపాటు పలువురు సాహితీ మిత్రులు ఉన్నారు.

సిఐ ప్రవీణ్‌కుమార్‌కు సన్మానం

ఉరవకొండ : ఉరవకొండ రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌కుమార్‌ను వైసిపి నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ నరసింహులు, మాజీ జడ్పిటిసి తిప్పయ్య, వైసిపి పట్టణ అధ్యక్షులు ఏసి ఎర్రిస్వామి, రాష్ట్ర డైరెక్టర్ వెంకటేశులు, ఉపసర్పంచి వన్నప్ప, ఉల్లిగప్ప, ఆంజనేయులు, హనుమంతు, రామకృష్ణ, గాదిలింగ, తదితరులు పాల్గొన్నారు.

సిఐ ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నార్పల : తీవ్ర వర్షాభావంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ద్విసభ్య కమిటీ సభ్యులు అలం నరసానాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని మంగపట్నం గ్రామంలో రైతు కామిరెడ్డి మిద్దె ఓబిరెడ్డి సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా వేరుశనగ, పత్తి, ఆముదం, కంది, జొన్న, సద్ద, కొర్ర, తదితర పంటలు సాగు చేశారన్నారు. అయితే ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సరిగా కురవకపోవడంతో పంటలు ఎండుదశకు చేరుకున్నాయన్నారు. కావున ప్రభుత్వం తక్షణం స్పందించి పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎర్రినాగప్ప, రామ్మోహన్‌చౌదరి, వెంకటరమణ, బయపరెడ్డి, భార్గవ్, వెంకటనారాయణరెడ్డి, చంద్రబాబు, రాజన్న, పిఎల్ లక్ష్మీనారాయణ, తలారి కుళ్లాయప్ప, రామానాయుడు, గంగాధర్ నాయుడు, శివారెడ్డి, మలిరెడ్డి, నాగేష్, రాధాకృష్ణ, శీనా, వెంకటరాముణ, వెంకటరాముడు, ఆదినారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి, ప్రభాకర్‌నాయుడు, చంద్రబాబునాయుడు, చంద్రశేఖర్‌నాయుడు, పి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలి

ఉరవకొండ : పట్టణంలోని ఈశ్వరీ మాత ఆలయం ముందు నెలకొన్ని డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని జనసేన మండల అధ్యక్షులు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఈశ్వరీమాత ఆలయ పరిసరాల్లో జనసేన నాయకులు పర్యటించగా డ్రెయినేజీ సమస్యలను స్థానికులు నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ ఈశ్వరీమాత ఆలయం పక్కనే దుర్వాసన వెదజల్లుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్నారు. ఇందిరానగర్ కాలనీ నుంచి మురుగునీరు ఈశ్వరి మాత ఆలయం ముందు నుంచి ప్రవహిస్తున్న కారణంగా ఈ సమస్య ఎదురవుతోందన్నారు. అంతేగాకుండా డ్రెయినేజీ పక్కనే చిన్న పిల్లల పాఠశాల ఉండటంతో తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాలువలను ఏర్పాటు చేసి డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దేవేంద్ర, రమేష్, భోగేష్, మనీర్, ఉపేష్, చందు, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రథమచికిత్సపై విద్యార్థులకు అవగాహన

అతిథులను సన్మానిస్తున్న అనంతలక్ష్మి యాజమాన్యం

అనంతపురం : జాతీయ సేవా పథకం, ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా శాఖ సంయుక్తంగా ప్రథమ చికిత్సపై విద్యార్థులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఈసీ మెంబర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రథమ చికిత్స జీవితంలో ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సమయంలో ఉపయోగపడుతుందన్నారు. ఏ కారణంతోనైనా రక్తం ఎక్కువగా పోతున్న సమయాల్లో కట్లు కట్టి రక్తము పోకుండా ఆపడం, ఊపిరి ఆడడం కష్టముగా ఉన్నప్పుడు కుత్రిమ శ్వాస ఇవ్వడం వంటి వాటిపై వివరించారు. రెడ్‌క్రాస్ సెక్రటరీ మోహనకృష్ణ, ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలన్నారు. మనిషి ప్రాణాలను కాపాడడానికి సమయస్ఫూర్తితో వైద్యసాయం అందించడమే ప్రథమచికిత్స అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ అనంతరాముడు, కళాశాల ప్రిన్సిపాల్ వి.మూర్తిరావుఖోకలే, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు సురేంద్రనాయుడు, వైస్ ప్రిన్సిపాల్ రామమూర్తి, జాతీయ సేవా పథకం అధికారి ఖలీల్‌బాషా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారతీయ స్టేట్ బ్యాంకు, CAC బ్రాంచ్, సాయినగర్, అనంతపురం

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, CAC బ్రాంచ్ వారికి నగదు సరఫరా చేయుటకు వాహనము కావలెను. వివరములకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, CAC బ్రాంచ్ మేనేజర్ (9440484707) గారిని సంప్రదించవలెను.

సం/-
శాఖ నిర్వహణాధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా CAC,
SBI మెయిన్ బ్రాంచ్ ప్రక్కన,
సాయినగర్, అనంతపురం

పంట కోత ప్రయోగాలు

ఉరవకొండ : మండల పరిధిలోని బుదగవి గ్రామంలో రైతులు సాగు చేసిన వేరుశనగ పంటలో అధికారులు శుక్రవారం పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ : మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై సిఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చాపిరి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులకు వెళ్లలేరని గ్రహించిన సీఎం జగన్ ప్రజల వద్దకే సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల సేవలను తీసుకొచ్చారన్నారు. ఇందులో భాగంగానే ప్రతి సచివాలయ పరిధిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసి గ్రామీణులకు కార్పొరేట్ వైద్యం అందజేస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు. అనంతరం కంటి పరీక్షలు నిర్వహించుకున్న వృద్ధులకు కళ్లద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యశాఖ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయదుర్గం మండలంలో కంటి అద్దాలు అందజేస్తున్న జడ్పిటిసి మల్లికార్జున

రాయదుర్గం రూరల్ : ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని రాయదుర్గం జడ్పిటిసి మల్లికార్జున తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని టి.వీరాపురం గ్రామంలో సర్పంచి ఓబులమ్మ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యులకు ఆరోగ్యప్రదాయనిగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం తోడ్పడుతోందన్నారు. గ్రామస్థాయిలో ప్రజల వద్దకే మెరుగైన వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం బ్రహ్మయ్య, ఉమ్మక్కతో పాటు మరికొందరికి కంటి అద్దాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కొండయ్య, తహశీల్దార్ మారుతి, ఎంపిటిసి లక్ష్మి, ఇఒఆర్‌డి శ్రీరంగనాయకులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం చాపిరి కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

ఉరవకొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే ధ్యేయంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని విడపనకల్ ఎంపిడిఒ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని హంచనహల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల ఆరోగ్యం కోసం సిఎం జగన్ ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పార్వతీ కేసన్న, వైద్యాధికారులు శ్రీకాంత్, శ్రీధర్, రాజేష్, ప్రతిమ, పంచాయతీ సెక్రటరీ బాబాఫక్రుద్దీన్, వైసిపి నాయకులు కరణం భీమ్‌రెడ్డి, కేసన్న, మస్తాన్, ఉప సర్పంచి భీమలింగప్ప, మండల స్వచ్ఛభారత్ మిషన్ కో -ఆర్డినేటర్ వన్నూరుస్వామి, గృహ సారథులు కిష్టప్ప, కొలిమి రాము, సచివాలయ కన్వీనర్ లక్ష్మన్న, సచివాలయ సిబ్బంది, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.